క్లుప్తంగా

11జీపీలకు ఉత్తమ అవార్డులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని 11 గ్రామపంచాయతీలు జాతీయ ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. ఈమేరకు వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయా సర్పంచ్‌లకు ఎమ్మెల్యే అరూరి రమేష్ అవార్డులు ప్రదానం చేశారు.

అనిల్‌కు బెస్ట్ ఫార్మసిస్ట్ అవార్డు



దేశాయిపేట: దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న సంగ అనిల్‌కుమార్ బెస్ట్ ఫార్మసిస్ట్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ క్షయవ్యాధి అవగాహన దినోత్సవం సందర్భంగా ఐఎంఏ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా అవార్డును అనిల్ అందుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధార్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, డీఐఓ డాక్టర్ మధుసూదన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత



కాజీపేట: 63వ డివిజన్ అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన ఓ నిరుపేద విద్యార్థి పోగుల వినతికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని ప్రజావేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ తిరునహరి శేషు శుక్రవారం అందజేశారు. ప్రజావేదిక గద్దె రమాదేవి ఫౌండేషన్ ద్వారా చేయూతనందించారు.

యాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఖిలా వరంగల్: సీపీఐ ప్రజా పోరుయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. శనివారం నుంచి బయ్యారంలో ప్రారంభమవుతున్న పాదయాత్రను పార్టీ నేతలు, కార్యకర్తలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, ల్యాదల్ల శరత్, యాకూబ్ పాల్గొన్నారు.

న్యాయమూర్తి పూజలు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయాన్ని జిల్లా అదనపు న్యాయమూర్తి మూర్తి కుటుంబ సమేత శుక్రవారం దర్శించుకున్నారు. ఈమేరకు ఆయనకు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు సాయికృష్ణ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఒకే ఆవరణలో 29 దేవతామూర్తులు ఉన్న ఏకైక ఆలయం దేశంలోనే మొదటిదని అర్చకులు న్యాయమూర్తికి వివరించారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రాలతో పాటు చిత్రపటాన్ని బహూకరించారు.

ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

హసన్‌పర్తి: ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా అని జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత అన్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్న బైరాన్‌పల్లికి చెందిన తాళ్ల రజితకు రూ.2.50 లక్షల ఎల్ఓసీని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాంబారెడ్డి, ఎంపీటీసీ జట్టి మంజుల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, ఉపసర్పంచ్ యుగంధర్, కేయూ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ

కరీమాబాద్: 43వ డివిజన్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నజీర్ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా పార్టీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అక్కపెల్లి స్పందన్, విక్టర్, హనుమాన్, షణ్ముఖరెడ్డి, కుమారస్వామి, సదానందం, యాకుబ్‌ఖాన్, రాణి, రాములు, గౌస్ పాల్గొన్నారు.

శ్లోకాల పఠనంతో మేధాశక్తి పెంపు



కాశిబుగ్గ: భగవద్గీత శ్లోకాల పఠనంతో పిల్లలో మేధాశక్తి, ఉచ్ఛారణ పెరుగుతుందని ఆంధ్రా బాలిక కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మదేవర శారద తెలిపారు. కాశిబుగ్గలోని స్టాండర్డ్ హైస్కూల్లో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను ఆంధ్ర బాలిక కళాశాల ప్రిన్సిపాల్ శారద, ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేటర్ రమాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృపాకర్ రాజు, రజిత, మాధవి, నవనీత, మంజుల, ప్రియాంక, రమేష్, స్పందన, రాణి, రాజేశ్వరి, సువర్ణ, శాలిని, రమ్య, సదా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు



హన్మకొండ: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



హనుమకొండలోని పెట్రోల్ పంపు పాఠశాలలో..



మడికొండలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



కరీమాబాద్: మాట్లాడుతున్న కార్పొరేటర్లు



కాజీపేట: పోషణ్ ర్యాలీ తీస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

హన్మకొండ: చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు ఉంటాయని, అవి ఆరోగ్యానికి ఎంతో మంచివని ఐసీడీఎస్ హనుమకొండ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కవిత అన్నారు. పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా ఆర్ఈసీ నాన్యతండా ఉన్నత పాఠశాలలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయసుధ, పరమేశ్వర్, పద్మప్రియ, సుమలత, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, సునీత, కవిత, అన్నపూర్ణ, వనజ, హేమలత పాల్గొన్నారు.

పెట్రోల్ పంపు పాఠశాలలో..

విద్యారణ్యపురి: చిరుధాన్యాలతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ప్రైమరీ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ ఏకాంతం పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

మడికొండ: పోషణ్ పక్వాడ సందర్భంగా మడికొండ, రాంపూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చిరుధాన్యాల్లో పోషక విలువలపై వ్యాసరచన, క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, రాంపూర్ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు, మడికొండలో పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

40, 42వ డివిజన్లలో..

కరీమాబాద్: చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన అన్నారు. వరంగల్ ఉర్సు శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ వరంగల్ అర్బన్ సీడీపీఓ విశ్వజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

విష్ణుపురిలో పోషణ్ అభియాన్ ర్యాలీ

కాజీపేట: ఇంటింటా పోషణ్ సంబరాల్లో భాగంగా కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీలో అంగన్‌వాడీ సిబ్బంది సోమిడిలో ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం నెహ్రూ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, విజయమణి, శోభ, గీతకుమారి పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో అవగాహన

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



పంటలను పరిశీలిస్తున్న విజ్ఞాన్, బాబు

ఖిలా వరంగల్: వడగాళ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకుంటుందని మండల వ్యవసాయాధికారి విజ్ఞాన్, 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు అన్నారు. గాడిపెల్లి, బొల్లికుంట గ్రామాల్లో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సోల్తీ భూమాతతో కలిసి వారు శుక్రవారం పర్యటించారు. కార్యక్రమంలో పోచన స్వామి, దామోదర్, సోల్తీ నరేందర్, రాజీవ్, భిక్షపతి, సదానందం, వీరస్వామి, యాదగిరి, రాములు, రమేష్, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు ప్రారంభం

వరంగల్ 37, 38 డివిజన్ల త్రికోటలో వ్యవసాయాధికారి విజ్ఞాన్ ఆధ్వర్యంలో పంట నష్టం వివరాల నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్లు వేల్పు గొండ సువర్ణ, బైరబోయిన ఉమ మాట్లాడుతూ వడగళ్ల వానతో పంట నష్టపోయిన ప్రతీరైతు వ్యవసాయాధికారుల వద్ద తమ పంట నష్టం వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వం అందించే ఆర్థిక చేయూతను అందుకోవాలని సూచించారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

హన్మకొండ: వరంగల్ అర్బన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్ రావు తెలిపారు. హనుమకొండలోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందని, సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

మూతబడిన క్వారీని తెరిపించాలి



వినతిపత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

కాజీపేట: మూతబడిన గ్రానైట్ క్వారీని తిరిగి తెరిపించాలని, క్వారీపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఉపాధి కల్పించాలని ఒడ్డెర సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఒడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య ఆధ్వర్యంలో హనుమకొండలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు రెండు వందల కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గండికోట వీరయ్య, కంది శ్రీనివాస్, చిన్న పెద్దులు, తిరుపతి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో డాక్టర్ కడియం కావ్య, జ్యోతి

జులైవాడ: విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కడియం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కడియం కావ్య సూచించారు. హనుమకొండ జులైవాడలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా హాస్టళ్లు, మారుమూల ప్రాంతాల్లో ఉండే బాలికలు రుతుక్రమంపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమ అధికారి శాగంటి జ్యోతి, తదితరులు ఉన్నారు.

అదనపు కలెక్టర్ శ్రీవత్సకు అభినందనలు



శ్రీవత్సను సన్మానిస్తున్న సంఘం నాయకులు

వరంగల్ రూరల్: వరంగల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీవత్స కోటకు ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు శుక్రవారం అభినందనలు తెలిపారు. ఇటీవల కన్‌ఫర్మ్‌డ్ ఐఏఎస్ అర్హత సాధించినందుకు శ్రీవత్సను సన్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరాల సందీప్, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణస్వామి, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఐలేష్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, జట్టి విక్రమ్ ఉన్నారు.

ధరణి పోర్టల్ రద్దు చేయాలి

ఖిలా వరంగల్: ధరణి పోర్టల్‌లో భూములు, స్థిరాస్తులు నమోదు కాకా రైతుల జీవితాలు రోడ్డు మీద పడుతున్నాయని, ఈక్రమంలో ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని జాతీయ కన్జ్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. ఈమేరకు న్యూఢిల్లీలోని కృషి భవనంలో కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీ, చీఫ్ కమిషనర్, అడిషనల్ సెక్రటరీ నిధిఖరేను ఆయన శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ధరణి పోర్టల్, పీడీసీ ఎస్‌బియ్యం పంపిణీ, సివిల్ సప్లై అధికారుల పనితీరు, వినియోగదారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాంబరాజు చక్రపాణి, రాయబారపు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఫోర్త్ జనరేషన్ 'వెర్నా'



కారును విడుదల చేస్తున్న ఆనంద్, యుగేందర్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ములుగురోడ్డులోని హేమ హ్యూందాయ్ షోరూంలో నూతన మోడల్ ఫోర్త్ జనరేషన్ వెర్నా కారును హనుమకొండ యాక్సిస్ బ్యాంకు మేనేజర్ ఆనంద్ చేతుల మీదుగా వరంగల్ మార్కెట్‌లోకి శుక్రవారం విడుదల చేశారు. ఈమేరకు వెర్నా కారు ప్రత్యేకతలను షోరూం మేనేజింగ్ డైరెక్టర్ యుగేందర్ వెల్లడించారు. 1.5, 1.5 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజన్‌లలో లభిస్తుందని, ప్రారంభ ఎక్స్ షోరూం ధర రూ.10.89 లక్షలని, ఈ సెగ్మెంట్‌లోనే లాంగెస్ట్ వీల్ బేస్ 2670 ఎంఎం 10.25 అంగుళాల టచ్ స్క్రీన్, సన్‌రూఫ్, ఫ్రంట్ వెంటిలేటెడ్, హీటెడ్ సీట్లు, బోస్ స్పీకర్స్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సార్, ఆరు ఎయిర్ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 65ప్లస్ సేఫ్టీ ఫీచర్లు, స్టాండర్డు సేఫ్టీ ఫీచర్లు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో షోరూమ్ డైరెక్టర్లు శ్రీధర్, పృథ్వీ, ఆదిత్య, ఏజీఎం మహేష్, సేల్స్ మేనేజర్ లక్ష్మణ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అదనపు కలెక్టర్, డీడబ్ల్యూఓపై సీఎస్‌కు ఫిర్యాదు

కాశోజీ సెంటర్: తనపై కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి.. డీసీపీఓ పోస్టు నుంచి తొలగించారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత అధికారులైన వరంగల్ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, డీడబ్ల్యూఓ శారదపై చర్య తీసుకోవాలని ఆ పోస్టు నుంచి రిలీవ్ అయిన గాదె మహేందర్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. వేధింపులకు గురిచేస్తున్నానంటూ తనపై క్రిమినల్ కేసు పెట్టించి.. శాశ్వతంగా ఉద్యోగంలోకి రాకుండా ప్రణాళికతో తనను బలిపశువును చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్య తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

నేడు ప్రత్యేక గ్రీవెన్స్

కాశోజీ సెంటర్: వరంగల్ కలెక్టరేట్‌లో దివ్యాంగులు, వయో వృద్ధులకు శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి మాచర్ల శారద ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ నెల నాల్గవ శనివారం గ్రీవెన్స్ ఉంటుందని, అందులో భాగంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

హన్మకొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య విమర్శించారు. హనుమకొండ ఆదర్శకాలనీలో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లను మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5న ఢిల్లీలో లక్షలాది మందితో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, జిల్లా కోశాధికారి యాస బాబు, యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పుల్ల అశోక్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఖిలా వరంగల్: క్రీడలతోనే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని 34, 39 డివిజన్ల కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, సిద్ధం రాజు తెలిపారు. మహిళా దినోత్సవ సందర్భంగా వరంగల్ 34వ డివిజన్ శివనగర్ ఆర్యవైశ్య భవనం, 39వ డివిజన్ ఏకశిలనగర్ జన్మభూమి జంక్షన్‌లో ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వర్యంలో ఇరువురు కార్పొరేటర్ల నేతృత్వంలో వేర్వేరుగా మహిళలకు క్యారమ్, చదరంగం, మ్యూజిక్ చైర్స్, చెస్ క్రీడాపోటీలను శుక్రవారం నిర్వహించారు. బిల్లా రాజు, సతీష్, నరేందర్, ఇందిర, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ ఎలకంటి రాములు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కుమ్మరి కోటిలింగం, గొట్టె పుల్లయ్య, దండు మహేందర్, కోరబోయిన శ్రావణ్ కుమార్, వెంకట్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డెర యువజన సంఘం జెండా ఆవిష్కరణ

మడికొండ: తెలంగాణ వడ్డెర యువజన సంఘం 5వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు శివరాత్రి ఐలుమల్లు ఆదేశాల మేరకు జిల్లా వడ్డెర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్ ఆధ్వర్యంలో మడికొండలో శుక్రవారం జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదారపు రవికుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్, నాయకులు పల్లపు వెంకటేష్, వెంకన్న, కిషన్, మహేష్, సాంబరాజు, లక్ష్మణ్, రాజు, సమ్మయ్య, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి మంత్రి పరామర్శ

కరీమాబాద్: 44వ డివిజన్ తిమ్మాపూర్‌కు చెందిన జలగం గుణవతి ఇటీవల మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శుక్రవారం పరామర్శించారు. గుణవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జలగం అనిత, రంజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడి గుమాస్తాకు గాయాలు

వరంగల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని మిర్చి యార్డులోని 14వ నంబర్ గద్దె వద్ద షెడ్డు పైపెచ్చులు ఊడి తలపై పడడంతో లక్ష్మీసాయి ఎంటర్‌ప్రైజెస్ గుమాస్తా అల్లి సతీష్‌కు గాయాలయ్యాయి. మిర్చి యార్డులో శుక్రవారం బస్తాలు దిగుమతి చేస్తున్న సమయంలో ఈఘటన చోటు చేసుకుంది. గాయపడిన అతన్ని గుమస్తా సంఘం నాయకులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాధితుడిని ఆదుకోవాలని మార్కెట్ చైర్మన్ దిడ్డి భాగ్యలక్ష్మి, ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్‌కు వినతి పత్రం అందజేశారు.

దళితుల సంక్షేమానికి కృషి చేయాలి

హన్మకొండ చౌరస్తా: దళితుల సంక్షేమానికి కృషి చేయాలని మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా కోరారు. ఈమేరకు ఢిల్లీలో సుప్రీంకోర్టు మాజీ సీజేఐ కేజీ బాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. మతం మారిన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలా లేదా అనే అంశంపై అధ్యయనం కోసం కేజీ బాలకృష్ణ నేతృత్వంలో కమిషన్ వేసిన నేపథ్యంలో బాలకృష్ణను కలిసినట్లు అనయ్ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మడికొండ మెట్టుగుట్ట ద్వారం వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. ఓ సిమెంట్ షాపులో కూలీలుగా పని చేస్తున్న నర్ర నవీన్, నార్లగిరి మహేందర్ పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో మెట్టుగుట్ట ద్వారం వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న కారు వారిని ఢీ కొట్టింది.

ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

హసన్‌పర్తి: ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ మహాసభ భీమారంలోని కేఎల్ఎన్ గార్డెన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి న్యూశాయంపేటలో ప్రభుత్వ స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ ఆర్ఎంపీలు, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, వైద్యులు

కరీమాబాద్: పశువుల్లో వచ్చే వ్యాధులను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న సూచించారు. మామునూరు కేవీకేలో పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పశు వైద్యులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజన్న మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక చికిత్స పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పశువైద్యం గురించి డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ అమృత్‌కుమార్, డాక్టర్ రమ్య, డాక్టర్ వెంకట్రామిరెడ్డి, డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ అరుణజ్యోతి వివరించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



విద్యార్థులతో సుదర్శన్, ఉపాధ్యాయులు

మామునూరు: బాల్య వివాహాలను అరికట్టాలని సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ సుదర్శన్ కోరారు. ఖిలా వరంగల్ మండలం స్తంభంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శోభారాణి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, లైంగిక వేధింపుల నిర్మూలనపై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో బాలికలు, మహిళలు 1098, 100, 112, 108, 1930 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం బాలికలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా కబడ్డీ దినోత్సవం

హసన్‌పర్తి: అంతర్జాతీయ కబడ్డీ దినోత్సవాన్ని భీమారంలోని డీవీఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దం రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి, జోన్ అధ్యక్షుడు అటికం రవీందర్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, రైతు బంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు పాల్గొన్నారు.

జాతీయ గణిత దినోత్సవం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని తరాలపల్లి, కడిపికొండ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రీజినల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రీజినల్ సైన్స్ సెంటర్ సైన్స్ అధికారులు వెంకటేశ్వర రావు, శ్రీనివాసస్వామి, ప్రధానోపాధ్యాయులు మనోజ్‌కుమార్, డి.అరుణ, రాజయ్య, అభినవ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

49 సిలిండర్లు స్వాధీనం

హన్మకొండ అర్బన్: గృహ అవసరాలకు వినియోగించాల్సిన 14 కిలోల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వ్యాపార అవసరాలకు వినియోగించడంపై వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో పౌరసరఫరాల అధికారులు శుక్రవారం దాడులు చేసి 49 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్ఓ వసంతలక్ష్మి తెలిపారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ ఏసిరెడ్డినగర్‌కు చెందిన ములుగు సుజాత 19 ఏళ్ల కుమార్తె హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తుంది. ఆస్పత్రికి వెళ్లి జీతం డబ్బులు తెచ్చుకుంటా అని తల్లికి చెప్పి ఆ యువతి గురువారం ఉదయం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

కేసు నమోదు

దేశాయిపేట: దేశాయిపేట సర్వే నంబర్ 304లో 2011 సంవత్సరంలో 400గజాల భూమి కొనుగోలు చేసి రేకులషెడ్డు నిర్మించుకుని ఉంటున్న ఎండి.తాజుద్దీన్ అనే వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ డి.మల్లేష్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఖిలా వరంగల్: భూమిని విక్రయించి తిరిగి అదే భూమిని ఆక్రమించేందుకు యత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే గుడ్ షెడ్ గోదాముల ఏరియాలో ఓ గుర్తు తెలియని 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహం లభ్యమైందని ఎస్సై కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు వివరించారు.

